ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 11 జూన్ 2024



జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి - 8లో..
ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య - 8లో..



పార్కులో నిర్మాణం పూర్తయిన వర్క్ షెడ్లు

వర్క్ షెడ్లలో పరిశీలనకు ఏర్పాటు చేసిన పవర్‌లూంలు

నేతన్నలు యజమానులుగా మారేనా?

- రూ.374 కోట్లతో వర్కర్ టు ఓనర్ పథకం
- మొదటి విడతలో 1104 మందికి అవకాశం
- కొత్త ప్రభుత్వ నిర్ణయం కోసం పవర్‌లూం కార్మికుల నిరీక్షణ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

నేత కార్మికులను యజమానులుగా మార్చడానికి గత ప్రభుత్వం చేపట్టిన వర్కర్ టు ఓనర్ పథకంపై సందిగ్ధం నెలకొంది. ఆత్మహత్యలు, ఆకలిచావులు వంటి విషాద సంఘటనల మధ్య సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకునే దిశగా గత ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. ప్రభుత్వ ఆర్డర్లతో కార్మికులకు ఉపాధి కల్పించింది. ఇదే క్రమంలో పవర్‌లూం కార్మికులను ఓనర్లుగా మార్చే వర్కర్ టు ఓనర్ పథకాన్ని తీసుకొచ్చింది. పథకానికి శ్రీకారం చుట్టినా పనులు నత్తనడకన సాగాయి. షెడ్ల నిర్మాణంతో ఆగిపోయాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వర్కర్ టు ఓనర్ పథకంపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందోననే సందిగ్ధంతో సిరిసిల్ల కార్మికులు ఎదురు చూస్తున్నారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డులో వర్కర్ టు ఓనర్ పథకంలో భాగంగా చేపట్టిన వర్క్‌షెడ్ల నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయి. కార్మికులు పరిశీలించడానికి వర్క్‌షెడ్లలో మోడల్‌గా మరమగ్గాలను, కండెల మిషన్లు ఇతర పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీంతో సిరిసిల్ల నేతన్నల్లో వీవింగ్ పార్కుపై ఆశలు మొదలయ్యాయి. వర్కర్ టు ఓనర్ పథకంలో లబ్ధిదారులను ఎంపిక చేయడానికి కసరత్తు ప్రారంభించిన క్రమంలోనే ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికలు ముగిసిపోవడంతో వర్కర్‌టు ఓనర్ పథకంపై కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతుందోననే ఆసక్తి కార్మికుల్లో ఏర్పడింది. మరోవైపు ప్రభుత్వం నుంచి గతంలో ఇచ్చిన బతుకమ్మ చీరలు వంటి పథకాలను నిలిపివేసింది. ఈ పరిస్థితుల్లో వర్కర్ టు ఓనర్ పథకం నిలిచిపోతుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

● రూ.374 కోట్లతో నిర్మాణం

దేశంలో ఎక్కడా లేని విధంగా మరమగ్గాల కార్మికులను యజమానులుగా మార్చే దిశగా వర్కర్ టు ఓనర్ పథకాన్ని రూపకల్పన చేశారు. ఇందుకు అనుగుణంగానే జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు వద్ద వీవింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. వర్క్‌షెడ్ల నిర్మాణం చివరి దశకు చేరుకుంది. కార్మికులకు నచ్చే విధంగా సెమీ ఆటో మరమగ్గాలను నమూనాగా ఏర్పాటు చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద 88 ఎకరాల్లో రూ.374 కోట్లతో వీవింగ్ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదటి విడతలో 1104 మంది కార్మికులకు వర్క్‌షెడ్లను నిర్మించి అందించాలనే లక్ష్యంగా పనులు ప్రారంభించారు. రోడ్లు, నీటి వసతి, కరెంట్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. 46 వర్క్‌షెడ్లను నిర్మించాలనే లక్ష్యంగా నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం వర్క్‌షెడ్ల నిర్మాణం చివరి దశకు చేరకుంది. ఇందులో కార్మికులకు మొదటి విడతలో 4,416 మరమగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించనున్నారు. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో స్టోర్‌రూంతో కలిపి అందించనున్నారు. ఇందులో నాలుగు సెమి ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధరను ముందుగా రూ.8 లక్షలుగా నిర్ణయించారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.15 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో పది శాతం లబ్ధిదారుడి వాటాధనం, 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకం రూపొందించారు. మరమగ్గాల ఎంపిక కోసం తాత్కాలికంగా నాలుగు ఆటోమేటిక్ మగ్గాలను కూడా పార్కులో ఉంచారు. ఇందులో విభిన్నమైన వస్త్రాలను తయారు చేసే అవకాశం ఉంది.

● కొందరికే మగ్గాలు

సిరిసిల్లలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేస్తున్న వీవింగ్ పార్కులో కొందరికే మరమగ్గాల యూనిట్లు దక్కే అవకాశం ఉండడంతో మిగతా కార్మికులు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 30,352 ఉన్నాయి. వీటిపై 6500 మంది పని చేస్తున్నారు. అనుబంధ పరిశ్రమల్లో మరో 6 వేల మంది వరకు పనిచేస్తున్న వారు ఉన్నారు. ప్రభుత్వం మొదటి దశలో కేవలం 1104 మందికే యూనిట్లను అందించడంతో మిగతా కార్మికులు నిరీక్షించే పరిస్థితి ఉంది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం పథకంపై మార్పులుచేర్పులు చేస్తుందని అర్హులందరికీ అందించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 10: భూ, ఆస్తి తగాదాల విషయంలో నిబంధనల ప్రకారం నడుచుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా 15 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థులపై కఠిన వైఖరి అవలంబిస్తామన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని, సాధ్యమైనతం త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జిదారుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలకు ఫోన్‌చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు.

డిగ్రీ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది

గంభీరావుపేట, జూన్ 10 : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు వివరిస్తూ సోమవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆన్‌లైన్ దోస్త్‌లో మొదటి ప్రాధాన్యంగా గంభీరావుపేట డిగ్రీ కళాశాలను ఎంచుకోవాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు

సిరిసిల్ల క్రైం, జూన్ 10: ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గత 41 ఏళ్లుగా పనిచేసి పదవీవిరమణ పొందిన హోంగార్డు సిరిగిరి దేవరాజును సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన హోంగార్డు సేవలను మరువలేమన్నారు. సంక్షేమ నిధి నుంచి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమేశ్, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత

తంగళ్లపల్లి, జూన్ 10: మూడు రోజుల క్రితం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామ శివారులోని రోడ్డుపై ఓ బ్యాగ్‌ను పోలీసులు కనుగొన్నారు. స్వాధీనం చేసుకున్న తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్ బ్యాగు ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న బ్యాగ్ పోగొట్టుకున్న బాధితుడు సిరిసిల్ల పట్టణం సిద్దుల వాడకు చెందిన మల్యాల శ్రీనివాస్ సోమవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాడు. పోలీసులు అతడికి బ్యాగ్‌ను అందజేశారు. హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు కారులో వస్తున్న క్రమంలో వాహనంపై ఉన్న బ్యాగు పడి పోయిందని బాధితుడు తెలిపారు.

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 10: వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వర్షాకాలం నేపథ్యంలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, స్కూల్ యూనిఫాం తయారీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ, మిషన్ భగీరథ, డీఆర్‌డీవో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు అధికంగా ప్రబలే ప్రమాదం ఉందని, నియంత్రణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచినీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను తరచూ శుభ్రపర్చాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని పేర్కొన్నారు. డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా వెంటనే సిల్ట్ తొలగించాలని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నల్లాల వద్ద, బోర్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరదలు రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలు ఇబ్బందులు పడ కుండా చూడాలని తెలిపారు. దోమల నియంత్రణకు కృషి చేయాలని, విష జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచి నీటి ట్యాంకుల్లో ఎప్పటి కప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కోటిమంది స్వశక్తి మహిళలను కోటీశ్వరులుగా మార్చేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. అందుకోసమే స్కూల్ యూనిఫామ్స్ తయారీ బాధ్యతను మహిళలకు అప్పగించామని చెప్పారు. పురాతన ఇళ్లను గుర్తించాలని, నష్టం కలగకుండా చూడాలని వివరించారు. ఉరుములు, మెరుపుల సమ యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకా లంలో ఇబ్బందులు కలుగకుండా జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పేర్కొన్నారు. వీడియో కాన్ఫ రెన్స్‌లో జిల్లాలో చేపడుతున్న కార్యక్ర మాలను మంత్రి సీతక్కకు వివరించారు. దోమల నివారణకు ఎప్పటిక ప్పుడు ఫాగింగ్ చేయిస్తున్నామని పేర్కొన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా మంచినీటి ట్యాంకుల్లో క్లోరి నేషన్ చేయిస్తున్నామని వివరించారు. వ్యాధుల ప్రబలకుండా వైద్య శాఖ అధికారులతో కలిసి ముందు జాగ్ర త్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డీ్ సీఈవో ఉమారాణి, మిషన్‌భగీరథ ఎస్ఈ రవీందర్, జిల్లా పంచాయితీ అధికారి రవీందర్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకి, గ్రిడ్ ఈఈ విజయ్ కుమార్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



సిరిసిల్లలో బీజేపీ నాయకుల సంబురాలు

సిరిసిల్ల రూరల్, జూన్ 10: మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానిగా, కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన బండి సంజయ్‌కుమార్ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో సిరిసిల్ల పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు నిర్వహించారు. బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్‌యాదవ్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పత్తిపాక సురేష్, నాయకులు నరేష్, చొప్పదండి అంజన్న, మ్యాన రాంప్రసాద్, మోర శ్రీహరి, ఆదిపల్లి శ్రీనివాస్‌గౌడ్, గాజుల వేణు, శంకర్, బాలకిషన్, ఇంజపురి మురళి, దుమాల శ్రీకాంత్, కోడం శ్రీనివాస్, గుడ్ల విష్ణు, తాటిపాముల సత్యం, బండారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ నూతన పాలకవర్గం సోమవారం బాధ్యతలు స్వీకరించింది. అర్బన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ గాజుల నారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు బొల్లి రామ్మో హన్, సందీప్, ఆకుల చిన్నా, అన్నారం శ్రీనివాస్ అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూన్ 10: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుండం నర్సయ్య కుటుంబాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాములు, బుచ్చాగౌడ్, తిరుపతిగౌడ్ తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయ
ఉద్యోగుల బదిలీలు జరిగేనా?



వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం

- ప్రధాన కార్యాలయానికి జాబితా

వేములవాడ టౌన్, జూన్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన జాబితా దేవాదాయ శాఖ కార్యాలయానికి పంపించినట్లు, అందులో పలువురు అర్చకుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో బదిలీలకు కార్యరూపం దాల్చలేదు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో దేవదాయశాఖ మంత్రి కొండ సురేఖ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయాల ఈవోలు, ముఖ్య అధికారులతో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడంతో ఆలయ వర్గాల్లో బదిలీల గుబులు పట్టుకుంది. ఏళ్ల తరబడి ఆలయాల్లో పాతుకుపోయిన ఉద్యోగుల బదిలీలపై సమావేశంలో చర్చించారు. ఎన్నికల కోడ్ అడ్డుగా ఉండడంతోనే ఉద్యోగుల బదిలీలల్లో జాప్యమైనట్లు, త్వరలో చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

రాజన్న ఆలయ ఉద్యోగుల బదిలీలపై ఉత్కంఠ నెలకొంది. గత కొన్నేళ్లుగా ఉద్యోగుల బదిలీలు చేపడతారని ప్రచారం జరుగుతుందే తప్ప చేపట్టిన దాఖలాలు లేవు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఒక్క ఉద్యోగి కూడా ఇతర దేవాలయాలకు వెళ్లకపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. దీంతో కొత్త ప్రభుత్వంలోనైనా బదిలీలు జరుగుతాయో? లేదో? అనే వాదనలు వినిపిస్తున్నాయి.ఆలయంలో పని చేసే కొంత మంది ఉద్యోగుల జాబితా ప్రధాన కార్యాలయానికి వెళ్లిందని, పలువురు ఆలయ ఉద్యోగులు ఎవరి పైరవీలు వారు చేస్తున్నారని తెలుస్తోంది. ఆలయంలో కీలక స్థానాల్లో పని చేసే చాలా మంది ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని, విజిలెన్స్ రికార్డుల్లో చాల మంది పేర్లు ఉన్నాయనే అపవాద మూటగట్టుకుంది. దీంతో ఏళ్ల తరబడి ఆలయంలో పాతుకు పోయిన ఆలయ ఉద్యోగులను బదిలీ చేయాలని ప్రజాప్రతినిధులుతోపాటు పట్టణవాసులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి జన్మదిన వేడుకలు



ఇల్లంతకుంటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, జూన్ 10:మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సోమవారం కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనతరం అన్నదానం చేపట్టారు. అంతకుముందు నాయకులు మాట్లాడుతూ ప్రజాసేవలో ఎమ్మెల్యే నిరంతరం కొనసాగుతున్నారన్నారు. మండలంలో అనేక మందికి వైద్యసేవలు అందించి ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఎంపీటీసీలు కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి, తీగల పుష్పలతనాగయ్య, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, ఆకుల సత్యం, గుండ వెంకటేశం, మ్యాకల శ్రీనివాస్, కూనబోయిన బాలరాజు, మ్యాకల శ్రీనివాస్, గుర్రం భూపతిరెడ్డి, ఉప్పల అమరేందర్, మామడి రాజు, చిట్టి ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ

- పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



సమస్యలు వింటున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 10: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విన్నపాలు వెల్లువెత్తాయి. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో తొలి సారిగా ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై కలెక్టర్ అనురాగ్ జయంతితోపాటు అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్‌కు అర్జీలు అందజేశారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో అధికారులు సఫలీకృతులయ్యారన్నారు. ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. దరఖాస్తుదారుడికి జవాబుదారితనంతో పని చేయాలని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అధికంగా రెవెన్యూ సంబంధిత దరఖాస్తులు, పెన్షన్లు మంజూరు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకోవాలనిసూచించారు. జిల్లాలోని రెవెన్యూ శాఖకు సంబంధించి 54 దరఖాస్తులు, ఉపాధికల్పనకు సంబంధించి 11 దరఖాస్తులతోపాటు వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 121 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వానాకాలం నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం కార్యాలయాల పరిసరాలలో జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రతీ శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాల్లో డ్రైడే నిర్వహించాలన్నారు. ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభమవుతోందని, అనుమతులు, గుర్తింపు లేని పాఠశాలలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయని, వాటి మీద చర్యలు తీసుకోవాలని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని పాఠశాలల యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని పాఠశాలల్లో ఆట స్థలాలు లేకుండానే నడిపిస్తున్నారని మండిపడ్డారు. నాయకులు మట్టె శ్రీనివాస్, రుద్రవేణి సుదీప్, కోడం వెంకటేష్, తిరుపతి, భాను, అరవింద్, కోటి పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

ముంపు గ్రామమైన చింతల్‌ఠాణా రేణుకా ఎల్లమ్మ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎల్లమ్మ ఆలయం మిడ్ మానేరులో మునిగిపోయిందని ఆ ఆలయానికి సంబంధించి రూ.33 లక్షలు మంజూరైన ఇంతవరకు సంఘానికి అందించలేదని సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం





భక్తుల తాకిడితో కిటకిటలాడుతున్న రాజన్న ఆలయం, క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ టౌన్, జూన్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తోపాటు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కోడె మొక్కు చెల్లింపునకు భక్తులు సుమారు 4 గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. సోమవారం కావడంతో సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ. 35 లక్షల వరకు ఆయా విభాగాల ద్వారా ఆయాదం సమకూరినట్లు అంచనా వేస్తున్నారు. ఈవో రామకృష్ణ నేతృత్వంలో సూపరింటెండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, తిరుపతి రావు, అశోక్, అల్లి శంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు.

19లోగా బీఎస్సీ ఆనర్స్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, జూన్ 10: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ రెండు, నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం చెల్లించడానికి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 19వ తేదీ వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుం తో 21వ తేదీ వరకు చెల్లించవచ్చని ఆయన తెలిపారు. పరీక్షలను జూలైలో నిర్వహించనున్నారు.

● ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ 2011-12 నుంచి 2019-20 వరకు అన్ని సెమిస్టర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 19వరకు ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 21వ తేదీ వరకు తుది గడువు అని ఆయన తెలిపారు. పరీక్షలు జూలై లేదా ఆగస్టు నెలలో నిర్వహించనున్నారు.

'పొన్నంపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం'

చిగురుమామిడి, జూన్ 10: బీసీ నేత, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని కల్లు గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతిగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిరాధార ఆరోపనణలు చేయడం సరికాదన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఇప్పటికైనా బీసీల పట్ల చిన్న చూపు చూడటం కౌశిక్ రెడ్డికి తగదన్నారు. సమావేశంలో జిల్లా గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి భాస్కర్‌గౌడ్, ముంజ వెంకన్న, బుర్ర శ్రీనివాస్, ఇల్లందుల రాములు, పచ్చిమట్ల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, జూన్ 10: శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామ శివారులో సోమవారం బైక్ పైనుంచి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దేవునూరి అనిల్ కేశవపట్నం వైపు నుంచి రాజాపూర్ మీదుగా ధర్మారం వస్తున్నాడు. ఈ క్రమంలో రాజాపూర్ శివారులో బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది అనిల్‌కు చికిత్స అందించి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10: మండల కేంద్రంలోని గంప నాగేంద్రంకు చెందిన ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేశామని ఎస్సై రమా కాంత్ సోమవారం తెలిపారు. నాగేంద్రం తన బైక్‌ను ఈ నెల 5న స్థానిక బస్టాండ్ ప్రాంతంలో పార్క్ చేసి కిరాణా దుకాణానికి వెళ్లాడని, తిరిగి వచ్చి చూసేసరికి వాహనం కనిపించకుండా పోయిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి


అంజనేయులు మృతదేహం

సైదాపూర్, జూన్ 10: సైదాపూర్ మండలంలోని ఘణపూర్ తండాకు చెందిన బానోతు అంజనేయులు (18) ప్రమాదవ శాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీ సులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘణపూర్ తండాకు చెందిన బానోతు మోతీలాల్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నాడు. కొడుకు అంజనేయులు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటలకు అంజనేయులు బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. అర్ధరాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో తండ్రి మోతీలాల్ వెళ్లి ఎక్కడ వెతికినా కనబడలేదు. సోమవారం ఉదయం ఘణపూర్ గ్రామ శివారులోని రావుల చంద్రారెడ్డి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా ఆంజ నేయులు సెల్‌ఫోన్, చెప్పులు బావి గడ్డపై కనబడ్డాయి. బావిలోని నీళ్లను కరెంటు మోటర్‌తో తీయగా అంజనేయులు మృతి చెంది కనిపించాడు. తన కొడుకు అంజనేయులు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందాడని మృతుడి తండ్రి మోతీలాల్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

ఆటో డ్రైవర్‌ను ద్విచక్రవాహనంతో ఢీ, స్థానికులతో గొడవ


గాయపడిన రాజు

కోల్‌సిటీ, జూన్ 10: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రోజురోజుకు గంజాయి మత్తులో యువకుల ఆగడా లు పెరిగిపోతున్నాయి. సోమవారం సాయంత్రం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ముగ్గురు ఆటో డ్రైవర్లు నిలుచొని మాట్లాడుతుండగా గంజాయి మత్తులో అతివేగంగా వచ్చి బండి రాజు అనే ఆటో డ్రైవర్‌ను మోటార్ సైకిల్‌తో ఢీకొట్టడంతో రాజు ఎగిరిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయపడిన రాజును అటు ఇటూ తిప్పుతూ ఆ యువకులు ఇబ్బందులకు గురిచేశారు. విఠల్‌నగర్‌కు చెందిన సాయి, మహేష్ అనే ఇద్దరు యువకులు గంజాయి సేవించి గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి అతి వేగంగా వచ్చి రాజును ఢీకొట్టారు. స్థానికులు వారిని పట్టుకోగా వారిపైనే యువకులు తిరగబడడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా మోటార్ సైకిల్‌ను వదిలి పారిపోయారు. గాయపడిన బండి రాజును గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తు న్నారు. అతని పరిస్థితి విషమంగా మారింది. ఘటన స్థలంలో పోలీసులు ఉన్నప్పటికీ ఆ యువకులను పట్టుకోవడం విఫలమయ్యారు.

పాము కాటుతో మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, జూన్ 10: మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన పడాల రజిత (38) అనే మహిళ పాముకాటుతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం కుటుంబ సభ్యులతో నిద్రించగా ఆదివారం ఉదయం 2 గంటల ప్రాంతంలో గాఢనిద్రలో ఉన్న రజిత చేయికి పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త పడాల వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు యత్నం



పట్టాదారు ఫిర్యాదుతో బయటపడిన వైనం

మున్సిపల్ రెవెన్యూ అధికారితో పాటు మరో ఇద్దరు రిమాండ్

పరారిలో కమిషనర్‌తో పాటు కీలక వ్యక్తి

జగిత్యాల టౌన్, జూన్ 10: నకిలీ పత్రాలు సృష్టించి భూమి కబ్జాకు యత్నించిన ఐదు గురు వ్యక్తులపై జగిత్యాల పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఈ కేసు లో మున్సిపల్ రెవెన్యూ అధికారితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కమిషనర్‌తో పాటు కీలక వ్యక్తి పరారిలో ఉన్నట్లు పోలీసులు పేర్కొంటూ పూర్తి వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని హస్నాబాద్ శివారులోని 1599 సర్వే నెంబరులో 12 గుంటల భూమిని పట్టణానికి చెందిన కీర్తి విజయ లక్ష్మి, వుటూరి గీతారాణి, గొల్లపెల్లి సత్యనారాయణలు కొనుగోలు చేసి పూర్తి హక్కుదారులుగా ఉన్నారు.

ఈ భూమిని ఎలాగైనా కబ్జా చేయాలనే ఉద్దేశ్యంతో జిల్లా కేంద్రంలోని సుతారిపేటకు చెందిన ఖాజా అమిరుద్దీన్ అతని స్నేహితులు ముజాకిర్ అలీ, ఇమ్రాన్ అనే ముగ్గురు కలిసి సాదాబైనామాకు సంబంధించి నకిలీ ధ్రువ పత్రాలు 13-బి, 13-సితో పాటు మ్యాపును సృష్టించారు. ముగ్గురు కలిసి జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న బడుగు ప్రసాద్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ అనీల్‌తో కలిసి నకిలీ ఇంటి నంబరు, నకిలీ ఆస్తి అసెస్మెంట్ పత్రాలను సృష్టించారు. వీటి ద్వారా ఇంటి నంబరుకు వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబరు కోసం 2012 అక్టోబరు నుంచి 2025 మార్చి 31 వరకు ట్యాక్స్ కింద రూ. 97,500 చెల్లించి భూమిని కబ్జా చేసేం దుకు పక్కాగా స్కెచ్ వేశారు. ఐదుగురు కలిసి కావాలని నేరపూరిత ఉద్దేశ్యంతో కుట్రపూరితంగా నకిలీ కాగితాలు సృష్టించి కబ్జాకు యత్నించిన భూమిని విక్రయించి వచ్చిన సొమ్మును ఐదుగురు కలిసి సమానంగా పంచుకునేలా కుట్రలు పన్నారు. తమ భూమిని కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని తెలుసుకుని భూమికి పూర్తి హక్కు దారుగా ఉన్న కీర్తి విజయలక్ష్మితో పాటు మరో ఇద్దరు కలిసి కబ్జాదారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

ఈ భూమి తమదేనని అన్ని ధ్రువ పత్రాలు ఉన్నాయని, వీఎల్‌టీ నంబరు కూడా ఉందని కబ్జాదారులు హక్కుదారులను బెదిరించారు. దీంతో కీర్తి విజయలక్ష్మి జరిగిన విషయాన్ని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు 409, 420,461, 471, 468తో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులు సోమవారం మున్సిపల్ రెవెన్యూ అధికారి బడుగు ప్రసాద్‌తో పాటు ఖాజా అమిరుద్దీన్, ముజాకిర్ అలీలను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు, మున్సిపల్ కమిషనర్ అనీల్‌తో పాటు ఇమ్రాన్ పరారీలో ఉన్నట్లు టౌన్ సీఐ వేణుగోపాల్ వివరించారు.

అత్యాచారయత్నం కేసులో మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జూన్ 10: పదేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కొండ రాహుల్(25)కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత సోమవారం తీర్పు ఇచ్చారు. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం.. 2023లో సిరిసిల్లలోని వీధి లో పదేళ్ల బాలిక ఒంటరిగా వెళ్లగా రాహుల్ ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. యువకుడి బారి నుంచి తప్పించుకున్న బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే ఆ యువకుడిపై అప్పటి సీఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పీపీ పెంట శ్రీనివాస్ వాదించారు. కోర్ట్ మానిటరింగ్ ఎస్సై రవీందర్ నాయుడు, కానిస్టేబుళ్లు మహేందర్, నరేందర్‌లు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో రాహుల్‌కు 3 సంవత్సరాల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

కరీంనగర్ రూరల్, జూన్ 10: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో సోమవారం కుక్కల దాడిలో మేడ శ్రీనివాస్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భావితరాలకు ఉత్తమ విద్యార్థులను అందించాలి

శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్


మాట్లాడుతున్న ఎస్‌యూ రిజిస్ట్రార్ వరప్రసాద్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 10: భావితరాలకు ఉత్తమమైన విద్యార్థులను అందించే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో సోమవారం తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు శారీరక పరీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులను పూర్తి చేసి అభ్యర్థులు ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎదగాలన్నారు. క్రమశిక్షణ గల భారతాన్ని నిర్మించడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు.

అనంతరం పీసెట్ కన్వీనర్ రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ మైదానంలో అభ్యర్థులకు అన్ని సౌకర్యా లను కల్పించామన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రం మొత్తం నుంచి 2,400 మంది పురుషులు, మహిళలు పీసెట్‌కు హాజరుకానున్నారని తెలిపారు. రోజుకు 600 మంది అభ్యర్థులను నాలుగు రోజులపాటు శారీరక పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. మొదటిరోజు 478 మంది అభ్యర్థులు పాల్గొనగా వారికి శారీరక పరీక్షలను 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్‌తో పాటు వివిధ రకాల క్రీడాంశాలలో నైపుణ్యాలను పరీక్షించారు. రిజిస్ట్రార్ వరప్రసాద్ అతిథులతో కలిసి జెండా ఊపి 100మీటర్ల పరుగు పందెంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీడీ జె ప్రభాకర్‌రావు, శాతవాహన యూనవర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజిముద్దీన్ మునవర్, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, శ్రీధర్‌రావు, నాగేశ్వర్‌రావు, పి శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


800 మీటర్ల పరుగులో పాల్గొంటున్న పీసెట్ అభ్యర్థులు

నంది రిజర్వాయర్‌లో తగ్గిన నీరు


నంది రిజర్వాయర్‌లో తగ్గిన నీటి మట్టం

ధర్మారం, జూన్ 10: ధర్మారం మండలం నందిమేడారంలో గల నంది రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గింది. ఈ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గడంతో కింది భాగంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెలలో రైతులకు సాగు నీరు అందిం చేందుకు వేమునూర్ పంప్‌హౌస్ నుంచి ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా నంది రిజర్వాయర్‌లో నీటి విడుదల చేశారు. దీంతో ఈ ప్రాంతంలోని వ్యవసాయ, గృహాల్లో ఉన్న బావుల్లో నీరు సమృద్ధిగా ఉండేది. అయితే ఇటీవల ఎండల తీవ్రత కారణంగా నంది రిజర్వాయర్‌లో నీరంతా అడుగంటి పోయింది. మొదటి రిజర్వాయర్‌లో కొంత నీరు ఉన్నప్పటికీ చివరి వరకు నీరంతా అడుగంటి ఎడారిగా కనిపి స్తోంది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే తప్ప ఇక్కడ నీటి ఇబ్బందులు తొలగిపోయే అవకాశాలు లేవు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేద్దామన్నా అందులో కూడా నీరు లేదని అధికారులు చెబుతున్నారు. ఇక ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తేనే నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

ఎలిగేడు, జూన్ 10: ఎలిగేడు గ్రామానికి చెందిన కుడుదుల లచ్చయ్య(55)అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలిగేడులో బర్లు కాసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. ఆదివారం ఉదయాన్నే బర్లను తోలుకొని గ్రామ శివారులోని ఎర్రగుంట చెరువు పరిసరాల్లో కట్టేశాడు. తిరిగి సాయంత్రం సమయంలో బర్లను తోలుకొని రావడానికి చెరువు వైపు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువుకట్టపై నుంచి జారీ చెరువులో పడి మృతి చెందాడు. మృతుడు లచ్చయ్య భార్య కుడుదుల భాగ్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట కేసులో 13 ఏళ్లకు..

ఏయిర్‌పోర్టులో ఒకరి అరెస్టు

మల్యాల, జూన్ 10: పేకాట కేసులో పోలీసులు ఒకరిని 13 సంవత్సరాలకు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2011లో పేకాట ఆడుతూ ఏడుగురు పోలీసులకు పట్టుబడ్డారు. అయితే ఈ కేసులో మల్యాలకు చెందిన హుస్సేన్ అనే వ్యక్తి విదేశాలకు వెళ్లాడు. కోర్టుకు హాజరు కాకపోవడంతో పోలీసులు విదేశాలకు వెళ్లాడని కోర్టుకు తెలిపారు. దీంతో లుక్ అవుట్ సర్క్యూలర్ జారీ చేశారు. శనివారం విదేశాల నుంచి ఇంటికి తిరిగివస్తుండగా హైదరాబాద్ ఏయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ పోలీసులు పట్టుకొని మల్యాల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సదరు వ్యక్తిని తీసుకువచ్చి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

రాయపట్నంలో ఇసుక డంపులు సీజ్

ధర్మపురి, జూన్ 10: ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో మైనింగ్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. రవిందర్‌రావు, పోలీస్ హెడ్‌కాన్ స్టేబుల్ ఎండీ సలీముద్దీన్, ఆర్ఐ రాజేంద్ర ప్రసాద్ సోమవారం సంయుక్తంగా దాడులు చేసి ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. కొంత కాలం నుంచి కొందరు వ్యక్తులు గోదావరి నదిలో అక్రమంగా ఇసుకను తొలగించి దూర ప్రాంతాల్లో విక్రయించేందుకు పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉంచారు. అందిన పక్కా సమాచారం మేరకు దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన రూ 6 లక్షలు విలువ గల ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. దీంతో ధర్మపురి చుట్టు పక్క గ్రామాల్లో కూడ అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపుల యజమానులు భయాందోళనలు చెందుతున్నారు.


రాయపట్నంలో అధికారులు దాడులు చేసి సీజ్ చేసిన ఇసుక డంప్‌లు

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

- రూ.3లక్షలు తీసుకొని నకిలీ నియమాకపత్రం అందజేత
- ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు


భర్తతో కలిసి ప్రజావాణికి వచ్చిన కవిత

సుభాష్‌నగర్, జూన్ 10: జిల్లా ఆసుపత్రిలో జీఎన్ఎమ్ నర్స్‌గా (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ) ఉద్యోగం ఇప్పిస్తామని రూ.3లక్షల రూపాయలు దండుకొని దొంగ నియామక పత్రాలు అందజేశారని బాధితురాలి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నుంచి బతుకుదెరువు కోసం 13సంవత్సరాల క్రితం మౌల్కర్ కవిత-దిలీప్ దంపతులు నగరానికి వచ్చారు. దిలీప్ స్థానికంగా పాన్ టేలా నిర్వహి స్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దిలీప్‌కు ఓ స్నేహితుని ద్వారా శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన మాచర్ల రాజయ్య అనే వ్యక్తి పరిచయం అయ్యాడు.

ఈ క్రమంలో జిల్లా ఆసుపత్రిలో జీఎన్ఎమ్ నర్స్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మ బలికాడు. ఉద్యోగం కోసం 5లక్షల రూపాయలు ఇవ్వాలని చెప్పి ముందుగా 3లక్షలు తీసుకున్నాడు. చాలా రోజులుగా ఉద్యోగం గురించి బాధితులు అడుగుతుండడంతో కలెక్టరేట్ ఏవో, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ నుంచి నకిలీ నియామక పత్రాలు ఇచ్చాడు. అనంతరం వారు ఉద్యోగంలో చేరేందుకు వెళ్లగా ఆ పత్రాలు నకిలీవి అని తేలింది. దీంతో వారు రాజయ్యను నిలదీశారు. అతడు తాను తీసుకున్న డబ్బుకు బాండు పేపర్ రాసిచ్చాడు. ఆ తర్వాత చాలా సార్లు రాజయ్యను డబ్బు ఇవ్వాలని ఒత్తిడి తీసుకువచ్చినా రేపు, మాపు అంటూ వాయిదాలు వేసుకుంటూ వచ్చాడు.

ఇటీవల అయనను డబ్బుల విషయంలో నిలదీయడంతో అసభ్య పదజాలంతో కులం పేరుతో దూషించడమే కాకుండా తమపై దాడికి ప్రయత్నించాడని బాధిత దంపతులు ఆరోపించారు. రాజయ్యపై చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

రూ. లక్షలు వెచ్చించినా ఫలితం శూన్యం

చిగురుమామిడి, జూన్ 10: చిగురుమామిడి మండలంలో 17 గ్రామాలు ఉండగా 16 గ్రామాల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. ఉపాధి హామీ పథకం ద్వారా 1.లక్షల 90 వేల రూపాయల చొప్పున ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. మండలంలోని పీచుపల్లిలో స్థలం సమస్యతో క్రీడా ప్రాంగణం నిర్మించలేదు. 16 గ్రామాల్లో దాదాపు 30 లక్షల 40 వేల రూపా యలు ఖర్చు చేసి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో బిల్లులు సక్రమంగా రాకపోవడంతో అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. మరికొన్ని గ్రామాల్లో నామమాత్రంగా పనులు చేశారు. క్రీడా ప్రాంగణా లను ఉపయోగంలోకి తీసుకరావడానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అయా గ్రామాల్లో నిర్మాణం చేసిన క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. క్రీడాప్రాంగణాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేసి పాఠశాలల విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అయా గ్రామాల ప్రత్యేక అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రత్యేక కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా చేస్తాం

మిట్టపల్లి మల్లేశం, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు

చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల నిర్మాణం చేపట్టింది. పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక అవి నిరుప యోగంగా ఉన్నాయి. ఇదే విషయంపై ఈ నెల 13న జరుగనున్న మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడి క్రీడా ప్రాంగణాలు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తాం.



ఉల్లంపల్లి క్రీడాప్రాంగణం

బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ రాష్ట్ర ప్రొటోకాల్ కో కన్వీనర్



సంజయ్‌తో రాహుల్‌రావు

సిరిసిల్ల రూరల్, జూన్ 10: తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌కు చెందిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రొటోకాల్ కో కన్వీనర్ సరిదెన రాహుల్‌రావు సోమవారం బండి సంజయ్‌ని ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. కరీంనగర్ ఎంపీగా రెండోసారి గెలుపొంది కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గతంలో విక్రయించిన ప్రభుత్వ భూమిపై విచారణ జరపడంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో ఆర్టీసీ బస్సులను ఆపాలని సిరిసిల్లలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని స్థానిక మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్ తెలిపారు. సర్వే నంబర్ 24, 25, 26లో సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వాలు దూపదీప నైవేద్యం కింద అర్చకులకు పంపిణీ చేశాయన్నారు. ఆ భూమిని విక్రయించారని పొందుపరిచామన్నారు. విచారణ జరిపి భూమిని స్వాధీనం చేసుకోవాలని, ప్రజల అవసరాల కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో నివసిస్తున్న ప్రజలు కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో సుమారు కిలో మీటరు దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందన్నారు. స్పందించిన అడిషనల్ కలెక్టర్ గౌతమి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ భూమిపై విచారణ జరిపి నివేదికను అందించాలని ఆర్డీవోను ఆదేశించారన్నారు. బస్సులు ఆపేలా చూడాలని ఆర్టీసీ అధికారులకు సూచించారని బాలరాజుయాదవ్ తెలిపారు. ఆయన వెంట నాయకుడు సంతోష్‌గౌడ్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేదికపై పూర్వ విద్యార్థులు

తంగళ్లపల్లి, జూన్ 10:తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2010-11సంవత్సరం పదోతరగతి విద్యార్థులు సోమవారం పాఠశాలలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సంద ర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటాపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా అధ్యక్షుడు దేవయ్య

ముస్తాబాద్, జూన్ 10 : మండల కేంద్రంలోని ఏఎంఆర్ గార్డెన్‌లో ముస్తాబాద్ మండల మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనాన్ని సంఘం మండల అధ్యక్షుడు మెంగని రాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బొప్ప దేవయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్, నామాల పోశెట్టి, సంయుక్త కార్యదర్శి మెంగని మహేందర్‌తోపాటు జిల్లా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దేవయ్య మట్లాడుతూ మున్నూరుకాపులు ఐక్యంగా హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో శీలం స్వామి, బొప్ప శ్రీధర్, విజయ, శంకరయ్య, ఆది లక్ష్మణ్, లచ్చన్న పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలి

గంభీరావుపేట, జూన్ 10 : రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలని గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన యాదవ సంఘం సభ్యులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. రెండో విడత గొర్రెల కోసం ఏడాది కిందట 60 మంది సభ్యులు డీడీలు కట్టినట్లు పేర్కొన్నారు. గొర్రెల పంపిణీ పథకం నిలిచి పోయిందని, తాము కట్టిన డబ్బులు ఇంత వరకు తిరిగి తమ ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. డబ్బులు తొందరగా వచ్చేలా చూడాలని కోరారు.

సమస్యను పరిష్కరించాలని రైతు ఆందోళన

సిరిసిల్ల రూరల్, జూన్ 10: తన వ్యవసాయ భూమిలో లూజ్ వైరింగ్ ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలని తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్‌కు చెందిన గంధం రమేష్ సోమవారం సిరిసిల్ల సెస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టాడు. రామచంద్రాపూర్ శివారులో రమేష్‌కు ఎకరం 20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. అందులో విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలు కిందికి వేలాడుతున్నాయి. తరచూ తీగలతో వ్యవసాయానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం చేయడంతో పాటు లూజ్‌వైరింగ్‌ను సవరించేందుకు మిడిల్ పోల్‌ను వేయాలని అందుకు డబ్బులను చెల్లించుకోవాలని చెప్పడంతో ఆగ్రహించిన రమేష్ కార్యాలయం ఎదుట బైఠాయించాడు. సమస్యకు పరిష్కారం చూపాలని ఆందోళనకు దిగాడు.

నీట్ ఫలితాలపై విచారణ చేపట్టాలి

గంభీరావుపేట, జూన్ 10 : నీట్-2024 ఫలితాలపై వెంటనే విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నీట్ నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నీట్ నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. పరీక్ష నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై దేశ వ్యాప్తంగా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఎన్‌టీఏ పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో న్యాయ విచారణ చేపట్టాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఈ అంశం ముడిపడి ఉందని, తక్షణమే పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని అన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఈ సమావేశంలో ప్రసాద్, వేణు, ప్రవీణ్, వంశీ. సాయి, అనిల్ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

తంగళ్లపల్లి, జూన్ 10: తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూరు గ్రామంలో బత్తుల సాగర్ అనే రైతుకు చెందిన గేద విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందింది. మాజీ సర్పంచ్ పొన్నం లక్ష్మణ్ గౌడ్ సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. మృతి చెందిన గేదెను అధికారులు పరిశీలించారు. బాధిత రైతుకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తంగళ్లపల్లి, జూన్10 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జోగం రాజు సూచించారు. సోమవారం తంగళ్లపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందని పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని, సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామపంచాయతీలో నిర్వహించాల్సిన రికార్డులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



చందుర్తిలో బడి బాటలో ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10: సర్కారు బడుల్లోనే ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్, గుండారం, తిమ్మాపూర్, అక్కపల్లి, అల్మాస్‌పూర్, దుమాల, పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో సోమవారం బడిబాట నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పాఠశాలల్లోని సౌకర్యాలు, పదో తరగతి విద్యార్థుల ఫలితాల వివరాలతో కూడిన కర పత్రాలను ఇంటింటా తిరుగుతూ పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రవేశ పెడుతున్న పథకాలను వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం పొన్నాలపల్లెలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. దమ్మన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బోయన్నగారి నారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలో బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను వివరించారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

ముస్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సురభి రాధాకిషన్‌రావు అన్నారు. మండలంలోని పోతగల్‌లో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రేష్మాసుల్తానా, రుముపతిరెడ్డి, చైర్మన్ ముచ్చర్ల భార్గవి, తోట ధర్మేందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి శ్రీనివాస దీక్షితులు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. విశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధిస్తున్నట్లు తెలిపారు. ఉచిత పాఠ్య నోటు పుస్తకాలు, యూనిఫాం, ఉదయం పూట రాగిజావ, పౌష్టిక ఆహారమైన మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బొగ్గారపు శంకర్, ప్రధానోపాధ్యాయుడు నరేష్, ఉపాధ్యాయులు ముఖేష్, రవికుమార్, చంద్రకళ, స్వప్న, మమత పాల్గొన్నారు.

కోనరావుపేట : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు మురళినాయక్ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అధిక మార్కులు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుకర్, నరేందర్, లక్ష్మీనారాయణ, మహేష్, చిరంజీవి, గోపి ఉన్నారు.

రుద్రంగి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షిత్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంతోపాటు బడితండా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలంటూ బడిబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలు, మధ్యహ్న భోజనంతో పాటు తదితర వసతులపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోత్గల్ బడిబాటలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాధాకిషన్‌రావు



ధర్మారంలో బడిబాట



పొన్నాలపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

సిరిసిల్ల క్రైం, జూన్ 10: మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్లలోని కార్యాలయంలో మాట్లాడారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న సిరిసిల్ల పట్టణంలోని కల్యాణ లక్ష్మీ ఫంక్షన్ హాలులో జాబ్ మేళా ఉంటుందని తెలిపారు. ఐటీ, నాన్ ఐటీకి చెందిన 60 కంపెనీల్లో 1000కి పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. జిల్లాలోని 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు.

ఇల్లంతకుంట : పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న జాబ్ మేళా పోస్టర్‌ను ఎస్సై రాజుగౌడ్ సోమవారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. నిరుద్యోగ యువకుత వ్యసనాలకు బానిస కావద్దని, భవిష్యత్‌పై దృష్టి సారించాలని అన్నారు. చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముస్తాబాద్ : జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న సిరిసిల్లలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల రూరల్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని కార్యాలయంలో మాట్లాడారు. ఆసక్తి గల యువత పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, పీసీ దామోదర్ తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన అనిల్ కుమార్



సీఎంతో అనిల్

కోనరావుపేట, జూన్ 10 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కర్నాల అనిల్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో సోమవారం కలిశారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కర్నాల అనిల్ ముఖ్యమంత్రిని కలిసి రాజరాజేశ్వరస్వామి ప్రసాదాన్ని అందజేశారు. కోనరావుపేట మండల అభివృద్ధికి సహకరించాలని కోరామని తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి

వేములవాడ టౌన్, జూన్ 10 : రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు నేటి తరం నడుంబిగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ అన్నారు. వేములవాడ పట్టణంలో చేపట్టిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి సోమవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి దేశ ప్రజలకు ఇసుమంత మేలు కూడా చేయలేదని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ అనేక మంది హేతువాదులను, జర్నలిస్టులను మేధావులను పొట్టనపెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. మత విద్వేశాలను నింపుకున్న ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బీజేపీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రిజర్వేషన్లను పేదలకు లేకుండా చేయాలని పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల, పట్టణ నాయకులు ఉన్నారు.

సాధారణ ప్రసవాలతోనే తల్లీబిడ్డ క్షేమం

కోనరావుపేట, జూన్ 10 : సాధారణ ప్రసవాలతోనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని కోనరావుపేట వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీ చేయించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని తేనెటీగల దాడి

చందుర్తి, జూన్ 10 : చందుర్తి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో రెండవ రోజు తేనెటీగలు దాడి చేశాయి. కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్ సమీపంలో రావిచెట్టుపై గల తేనెటీగలు రెండు రోజులు నుంచి లేచి రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనాలతో పాటు, సైకిల్‌పై వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయపడ్డారు. కొంతమంది గ్రామస్థులు తేనెటీగల దాడి నుండి తప్పించుకోవడం కోసం దుప్పట్లు కప్పుకుని పరుగులు తీశారు. తేనెటీగల దాడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రజావాణిలో తహసిల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు.

జ్యువెల్లరీ షాప్‌లో అగ్ని ప్రమాదం

రుద్రంగి, జూన్ 10 రుద్రంగి మండల కేంద్రంలోని ఓ జ్యువెల్లరి షాప్‌లో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దుకాణా యజమాని రాము వివరాల ప్రకారం.. జ్యువెల్లరీ పని చే స్తుండగా గ్యాస్ సిలెండర్ పైపు లీకవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సిరిసిల్ల అశోక్, పోలీసులు, స్థానికులు అరగంట కష్టపడి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షాప్‌లో ఉన్న పర్నిచర్, ఒక మొబైల్ ఫోన్ కాలిపోయినట్లు తెలిపాడు.

రహదారిపైకి నక్క

ఎల్లారెడ్డిపేట, జూన్ 10: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ శివారులోని అర్బన్ పార్కు సమీపంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపైకి సోమవారం ఓ నక్క వచ్చిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రోడ్డు దాటుతూ కనిపించిందని పేర్కొన్నారు. సెల్‌ఫోన్లలో బంధించేందుకు ప్రయత్నించినా అతి వేగంగా పరుగెత్తిందని తెలిపారు. సమీప అటవీ ప్రాంతం నుంచి నక్క వచ్చినట్లు పేర్కొన్నారు. వన్యప్రాణులు తరచూ రోడ్డు పైకి వస్తున్నాయని స్థానికులు, రైతులు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

ముస్తాబాద్, జూన్ 10 : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కరికె నాంపెల్లి రోడ్డు ప్రమాదంలో మరణించగా బాధిత కుటుంబానికి పోచమ్మ యూత్ ఆధ్వర్యంలో చేయూతనందించారు. సోమవారం నాంపెల్లి ఇంటి వద్దకు వెళ్లి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రంజాని నరశ్, మిరుదొడ్డి భాను, ఏదూనూరి భాను. తాళ్ల విజయ్‌రెడ్డి, శీల ప్రశాంత్, సారుగు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్నకు కమలాభిషేకం

మల్యాల, జూన్ 10: ప్రధానిగా మోదీ మూడవ సారి బాధ్యతలు చేప ట్టడమే కాకుండా కేంద్ర మంత్రులుగా కరీంనగర్, సికింద్రాబాద్ ఎంపీలు నియమితుల వడంతో బీజేపీ నాయకులు సోమవారం కొండ గట్టు ఆంజనేయస్వామికి కమలం పువ్వులతో అభిషేకం చేశారు. స్వామివారి మూలవిరాట్టును బీజేపీ ఎంపీల సంఖ్య అయిన 241 కమలం పువ్వులతో అలంకరించారు. ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇక్కడ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

చౌడాలమ్మ ఆలయంలో ప్రభుత్వ విప్ పూజలు

గొల్లపల్లి, జూన్ 10 : ఈ ఏడు వర్షాలు పుష్కలంగా కురిసి, పంటలు సం వృద్ధిగా పండాలని, పిల్లాపాప, గొడ్డుగోదా అందరిని సల్లంగా చూడు చౌడాలమ్మ తల్లి అంటూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వేడుకున్నారు. గొ ల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో జరుగుతున్న చౌడలమ్మ తల్లి పట్నాల మహోత్సవంలో భాగంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం చౌడలమ్మ తల్లిని దర్శించుకున్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, కుల సంఘం పెద్దలు పూర్ణకుంభాభి షేకంతో ఘన స్వాగతం పలికారు. లక్ష్మణ్ కుమార్‌కు శాలువాలు కప్పి ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అ నంతరం లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ కుల దేవతలను కొలవాలని సూచించారు. అప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉండాలని పేర్కొన్నారు.

●గొల్లపల్లి మండలంలో శ్రీరాముల పల్లె గ్రామంలో నిన్న మధ్యాహ్నం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బా లే లక్ష్మయ్య కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమా ర్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సా నుభూతి తెలిపి ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా బాధిత కుటుంబానికి అండ గా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు తన వంతుగా ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

- కానరాని హెచ్చరిక బోర్డులు - తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ప్రధాన రహదారిలోని మూలమాలుపు

రుద్రంగి, జూన్ 10: రుద్రంగి మండల కేంద్రంలోని శివారులో కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలోని కలిగోట తండా సమీపంలోని మూలమాలుపు, వేములవాడకు వెళ్లే రోడ్డులో గంగమ్మ గుడి వద్ద మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. తరచూ రహదారిపై ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. మూలమాలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేక పోవడంతో ప్రమాదాలు సంభవి స్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు సంఘటనల్లో కొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- పోతు రాఖేష్, యువకుడు, రుద్రంగి.



రుద్రంగి శివారులోని ప్రధాన రహదారిపై మూల ములుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రేడియంతో ఉన్న బోర్డులను ఏర్పాటు చేస్తే రాత్రి వేళల్లో వాహనదారులకు కనిపిస్తుంది. దీంతో ప్రమాదాలను నివారించవచ్చు.

ప్రభుత్వ వైద్యశాలలో సిమెంట్ పట్టీలు నో స్టాక్

సిరిసిల్ల టౌన్, జూన్ 10: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రిలో మౌలిక సదుపాయాలను సమకూర్చుతున్నామంటూ చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదు. సిరిసిల్లలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో సోమవారం చోటు చేసుకున్న సంఘటనే ఇందుకు నిదర్శనం. ఆస్పత్రిలో స్టాక్ లేదు పట్టికొని తెచ్చుకుంటేనే కట్టు కడతామంటూ డ్యూటీలో ఉన్న వైద్యుడు నిర్మోహమాటంగా తేల్చి చెప్పాడు. జిల్లాలోని గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన వంగ మల్లికార్జున్ అనే బాలుడు గ్రామంలో తోటి స్నేహితులతో ఆటలాడుతుండగా పడిపోయాడు. దీంతో ఎడమ మోచేతికి గాయమైంది. వెంటనే తండ్రి బాల్‌రెడ్డి జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తీసుకొచ్చాడు. ఎమర్జెన్సీ వార్డులో డ్యూటీలో ఉన్న వెద్యుడు ఎక్స్‌రే తీయాలని చీటీ రాసి ఇచ్చాడు. ఆసుపత్రిలో ఎక్స్‌రే పని చేయడం లేదని సిబ్బంది చెప్పడంతో డబ్బులు పెట్టి బయట ఎక్స్‌రే తీసుకొచ్చారు. మల్లికార్జున్ ఎడమ చేయి మోచేతి వద్ద విరిగిందని ఎక్స్‌రేలో తేలడంతో సిమెంట్ పట్టి వేయాలని ఆసుపత్రిలో సిమెంట్ పట్టీలు స్టాక్‌లేదని బయట కొని తెచ్చుకోవాలని వైద్యుడు చెప్పాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎక్స్‌రే, సిమెంట్ పట్టీలు అందుబాటులో లేకపోవడం ఏమిటని వైద్యుడిని ప్రశ్నించారు. గత్యంతరం లేక బయట మెడికల్ షాపులో సిమెంట్ పట్టి కొని తెచ్చుకున్నారు. మల్లికార్జున్ చేతికి పట్టి కూడా వైద్యుడు కాకుండా సిబ్బంది వేయడానికి ప్రయత్నించడంతో బాలుడి తండ్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. నిలదీయడంతో వైద్యుడే పట్టి వేశాడు. ప్రభుత్వాస్పత్రుల్లో పేదలకు వైద్య సేవలు సరిగా అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ప్రహరీ కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న జడ్పీటీసీ మ్యాకల రవి

వేములవాడ టౌన్, జూన్ 10: వేములవాడ మండలం అనుపురంలోని సహకార సంఘం గోదాం స్థలంలో నిర్మించిన ప్రహరీని పక్కన ఉన్న ఇంటి వ్యక్తి ఎక్స్‌కావేటర్ సహాయంతో కూల్చి వేశాడని, సదరు వ్యక్తిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ మ్యాకల రవితోపాటు గ్రామస్థులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. నాంపల్లి సింగిల్‌విండో పరిధిలోని అనుపురం క్లస్టర్‌లో రైతుల సౌకర్యార్థం రెండు గుంటల భూమిని కేటాయిస్తూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. అయితే రెండు గుంటల చుట్టూ సింగిల్ విండో ఆధ్వర్యంలో బేస్ మెంట్‌తో ప్రహరీ నిర్మించారు. అయితే 886 ప్లాట్ ఇంటి యజమాని అకారణంగా ప్రహరీని ఎక్స్‌కావేటర్‌తో కూల్చి వేసి, రాత్రికి రాత్రే మట్టి కొట్టించాడని గ్రాస్థులు ఆరోపిస్తున్నారు. సంఘం ప్రహరీ కూల్చి వేతకు కారణమైన వ్యక్తిపై, ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సంబందించిన స్థలాన్ని కాపాడాలని పేర్కొన్నారు. దీంతో స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారని, అనంతరం విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిపారు.

చినుకు పడితే బురదమయం

- మురికి కూపంగా పరిసరాలు
- రామన్నపేటవాసుల కష్టాలు



రోడ్డుపై నిలిచిన నీరు

చందుర్తి, జూన్ 10: చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. భారీగా వరద నీరు నిలవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా రోజుల నుంచి ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న వానకే పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డులోని మూలమలుపు ప్రదేశంలో భారీగా నీరు వచ్చి చేరుతోంది. మురికి కాలువలు లేకపోవడంతో రోడ్డుపై నీరు చేరి బురద తయారవుతోంది. పరిసర ప్రాంతాలు కూడా చెత్త చెదారంతో నిండి మురికి కూపంగా మారుతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది రాత్రి వేళలో ఇళ్లలో స్వైరవిహారం చేస్తున్నాయి. నిత్యం ప్రజలు తిరిగే చోట ఇలా ఉంటే మామూలు వార్డుల్లోని పరిసరాలు ఏ విధంగా ఉంటున్నాయో అని మండిపడుతున్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుపై నీరు నిలవ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.